నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానంలోని శ్రీమద లర్మేల్ మంగా, పద్మావతి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్ల 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు, శ్రీ ఆంజనేయ, శ్రీమల్లికార్జున స్వామి, దుర్గా, సంతోషిమాత, పోచమ్మ అమ్మవార్ల 23వ వార్షికోత్సవాలు ఈ నెల 17 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 23, క్యారెట్ 19, దొండ 18, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 21, దోసకాయ 19, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 27, చామగడ్డ 45, మొరంగడ్డ 15, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5.

ఆరు నెలల్లోపే రెండోసారి..

కంటోన్మెంట్‌కు ఉప ఎన్నిక



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నాలుగో దశలో మే 13న ఎన్నికలు జరగనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. పార్లమెంట్ ఎన్నికలతో పాటే కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఉంటుందని వెల్లడించారు. గత నవంబర్ 30న రాష్ట్ర అసెంబ్లీతో పాటు కంటోన్మెంట్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన జి. లాస్య నందిత విజయం సాధించారు. గత నెల 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యం అయింది. ఎమ్మెల్యే మరణించిన 23 రోజుల్లోనే సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడంతో, కంటోన్మెంట్‌కు సైతం ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 1957లో ఏర్పాటైన సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో 1969లో తొలిసారిగా ఉప ఎన్నిక జరగ్గా, ప్రస్తుతం రెండోసారి ఉప ఎన్నిక జరగనుంది.

232 బూత్‌లు..

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలో తాజా ఓటరు జాబితా సవరణ ప్రకారం 2,52,060 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,26,145 మంది కాగా, మహిళలు 1,25,907 మంది, ఎనిమిది మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. గత నవంబర్‌లో నిర్వహించిన ఎన్నికల నాటికి మొత్తం ఓటర్లు 2,50,733 ఉండగా, తాజాగా 1,311 మంది ఓటర్లు పెరిగారు. మొత్తం 232 పోలింగ్ బూత్‌లు ఉండగా, వీటిలో మూడు పోలింగ్ బూత్‌లలో వెయ్యికి పైగా ఓట్లు ఉండటంతో గత ఎన్నికల్లో ఆయా బూత్‌లలో రెండేసి చొప్పున ఈవీఎంలు ఏర్పాటు చేశారు. తాజా సవరణలో భాగంగా ఫిబ్రవరిలో ప్రకటించిన ఓటరు జాబితాలో వెయ్యికి పైగా ఓట్లు ఉన్న కేంద్రాలను క్రమబద్ధీకరించడంతో పోలింగ్ బూత్‌ల సంఖ్య 232కు తగ్గింది. పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీకి ఏక కాలంలో ఎన్నికలు నిర్వహిస్తున్నందున కంటోన్మెంట్‌లో ఎన్నికల కోసం 464 ఈవీఎంలు అవసరం అవుతాయి. పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య పెరిగితే మాత్రం తదనుగుణంగా ఈవీఎంను సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

13 కేంద్రాలు.. 2600 విద్యార్థులు

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సనత్‌నగర్: రేపటి (సోమవారం) నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 30 వరకు ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించిన విషయం విదితమే. సికింద్రాబాద్ మండల పరిధిలో ఏర్పాటు చేసిన 13 కేంద్రాల్లో 2600 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 156 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. మార్కెట్, మహంకాళి, బేగంపేట పోలీస్‌స్టేషన్లలో ఇప్పటికే పదో తరగతి ప్రశ్నాపత్రాలను భద్రపరిచారు. ఆయా పోలీస్‌స్టేషన్ల నుంచి నిర్ణీత సమయానికి భద్రత నడుమ ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించనున్నారు.

అమీర్‌పేట మండలంలో..

అమీర్‌పేట మండలంలో 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 1987 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 120 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 10 చీఫ్ సూపరింటెండెంట్‌లు, 10 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 10 మంది కస్టోడియన్ అధికారులు విధులు నిర్వర్తించనున్నారు. అమీర్‌పేట మండలానికి సంబంధించి 10 పరీక్షా కేంద్రాలకు వెళ్లే ప్రశ్నాపత్రాలు ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఇప్పటికే ఇన్విజిలేటర్లు అధికారులకు రిపోర్ట్ చేశారు.

కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు..

పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమయ్యే సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా నీడ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అలాగే మంచినీటి సౌకర్యం కల్పించారు. పదో తరగతి పరీక్షలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా హాల్‌టికెట్ నెంబర్లు, వారికి కేటాయించిన హాల్ నెంబర్ల వివరాలను పరీక్షా కేంద్రాల వద్ద నోటీస్ బోర్డుల్లో ఏర్పాటు చేయడమే కాకుండా హాళ్లలోని టేబుళ్లపై నెంబర్లను వేశారు.

సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేలా కృషి చేయాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

రాంగోపాల్‌పేట్: విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని కలిగిస్తూ వారిలోని నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సెయింట్ ఫ్రాన్సిస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ జోసఫ్ అన్నారు. బేగంపేట్ సెయింట్ ఫ్రాన్సిస్ డిగ్రీ కళాశాలలో అమెరికన్ కార్నర్ రోబోటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రెండు రోజుల పాటు రోబో క్రాఫ్ట్ ఒడిస్సీ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. తెలస్య ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ కంపెనీ వ్యవస్థాపకులు జీఎస్ఎల్ రవితేజ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి విద్యార్థులకు రోబోలను తయారు చేయడంలో తర్ఫీదునిచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో విజ్ఞాన శాస్త్రం మరింత ఉన్నతస్థాయికి చేరుకోబోతుందని రోబోలే కీలకపాత్ర పోషించబోతున్నాయన్నారు. సైన్స్‌లో ఇలాంటి ఆసక్తికరమైన వాటి గురించి విద్యార్థి దశలోనే వారికి ప్రాక్టికల్‌గా బోధిస్తే మరింతా మక్కువ పెంచుకుంటారన్నారు.

మితాహార వితరణ ప్రారంభం



మిత ఆహార వితరణ సేవను ప్రారంభిస్తున్న కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: తొమ్మిదేళ్లుగా మండు వేసవిలో బాటసారులకు అన్నపానీయాలను అందిస్తూ వారికి ఉపశమనం కలిగిస్తున్న మానవ సేవా సమితి సేవలు స్ఫూర్తిదాయకమని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. మోడల్‌కాలనీ కమాన్ వద్ద మానవ సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మిత ఆహార వితరణ సేవ శనివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ.. వేసవికాలంలో రెండు నెలలకు పైగా అన్నార్తులకు ఆహారాన్ని అందించడం ఎంతో గొప్ప సేవ అన్నారు. ప్రయాణంలో ఎంతో మంది ఆకలి దప్పికలతో అలమటిస్తూ ఇబ్బందులు పడుతుంటారని, అలాంటి వారికి మిత భోజన వితరణ కేంద్రం ఉపశమనం కలిగిస్తోందన్నారు. ఈ సేవా యజ్ఞాన్ని కొనసాగిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బుచ్చిబాబు, జేఎస్‌టీ శాయి, శశికాంత్, రాజేశ్వరి, రవీంద్రబాబు, పీఎంకే గాంధీలతో పాటు కొలను బాల్‌రెడ్డి, పార్థసారధి పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం



సనత్‌నగర్: వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సనత్‌నగర్ అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఆర్‌బీ నారాయణ జ్ఞాపకార్థం ఆయన తనయుడు సనత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్‌బీ నరేష్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య హాజరైన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలన్నారు.

పండగలు మత సామరస్యాన్ని పెంచాలి



జ్యూస్ పంపిణీ చేస్తున్న ధరమ్‌రాజ్ చౌదరి

బన్సీలాల్‌పేట్: పండుగలు ప్రజల మధ్య మతసామరస్యం, సోదరభావాన్ని పెంపొందించి అందరూ సుఖ సంతోషాలతో ముందుకు సాగేలా ఉండాలనీ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధరమ్‌రాజ్ చౌదరి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం సికింద్రాబాద్ ఆర్పీరోడ్డులోని మసీదులో ఉపవాసదీక్ష చేస్తున్న ముస్లింలకు జ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైన మాసమని నిష్టతో ఉపవాసం చేస్తున్న ముస్లింకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షులు ఉస్మాన్, అన్వర్, ఇమ్రాన్, అహ్మద్, నేతలు కిరణ్, రాజేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి భగత్‌సింగ్ యువజనోత్సవాలు

ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలో ఈ నెల 17 నుంచి భగత్‌సింగ్ యువజనోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి తెలిపారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ కాలేజీ ఎదుట యువజనోత్సవాల విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భగత్ సింగ్ యువజనోత్సవాలలో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో వ్యాసరచన, సాంస్కృతిక, క్రీడలు, కుస్తీ తదితర పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నేడు నో డ్రగ్స్ పేరుతో ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ నుంచి 2కే రన్‌ను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవినాయక్, లెనిన్, డీవైఎఫ్ఐ నేత అస్మి అలానే పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు పొందిన చిన్నారులతో చైర్మన్

అమీర్‌పేట: చిన్నారులు విద్యతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని సిస్టర్ నివేదిత స్కూల్ చైర్మన్ డా.పి.సుధాకర్‌రావు అన్నారు.అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని స్కూల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.యూకేజీ పూర్తి చేసి ఒకటవ తరగతిలోకి ప్రవేశించే పిల్లలకు ఆయన సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో స్కూలు సెక్రటరీ రమాదేవి, ప్రిన్సిపాల్ లలితకుమారి, కరస్పాండెంట్ హరిహర ప్రసాద్, ప్లే స్కూల్ కో-ఆర్డినేటర్ సునీత పాల్గొన్నారు.

మోదీని కలిసిన తార్నాక నేతలు



మోదీతో ప్రకాష్‌గౌడ్, వీరన్న

లాలాపేట: విజయ సంకల్ప యాత్రలో భాగంగా రెండు రోజుల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీని నేరుగా కలిసే అవకాశం తార్నాక డివిజన్‌కు చెందిన పలువురు ముఖ్య నేతలకు దక్కింది. శనివారం మహంకాళి సికింద్రాబాద్ జిల్లా కార్యాలయ కార్యదర్శి ప్రకాష్‌గౌడ్, జిల్లా కార్యదర్శి ఎం. వీరన్న తదితరులు ప్రధాని మోదీని కలిసి ఆనందం వ్యక్తం చేశారు.

కుల గణన జీవోతో నవశకం

నల్లకుంట: కుల గణన జీవోతో తెలంగాణ రాష్ట్రంలో నవ శకం ప్రారంభమైందని తెలంగాణ బీసీ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.పి.మురళీకృష్ణ అన్నారు. ఈ జీవో జారీతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని తెలిపారు. శనివారం నల్లకుంట రత్నానగర్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చరిత్రాత్మక కుల గణన జీవో జారితో ఎస్సీ, ఎస్టీ తదితర సామాజిక కులాలతో పాటు, 130 బీసీ కులాలు, ఇతర కులాల జనాభా లెక్కలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ డిమాండ్ నెరవేరబోతుందన్నారు. కుల గణన జీవో జారి చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంలకు కృతజ్ఞతలు తెలిపారు.

కళా సిల్క్ ప్రదర్శనకు ఆదరణ



వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

లాలాపేట: ఐఐసిటీ స్టాఫ్ క్లబ్‌లో కొనసాగుతున్న కళా సిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శనకు రోజు రోజుకు ఆదరణ పెరుగుతుంది. ఈ ప్రదర్శనలో కొలువుదీరిన చేనేత కాటన్ వస్త్రాలు వేసవి నేస్తాలుగా భావిస్తున్న నగర వాసులు వాటిని కొనుగోలు చేయడానికి మక్కువ చూపుతున్నారని నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి చేనేత హస్త కళాకారులంతా ఒకేచోట చేరి 50 స్టాళ్లు ఏర్పాటు చేశారని ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మడుగు కాదు.. మురుగు



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని శ్రీ దుర్గా హైస్కూల్ గల్లీలో మురుగు నీరు రోడ్డుపై వరదలా పారుతుంది. పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు ఈ మురుగు నీటి గుండానే వెళ్లాల్సి వస్తుంది. ఈ మురుగు నీటి గుండా వెళుతూ దుర్వాసనతో పాటు స్కూల్ డ్రెస్‌లపై మురుగు నీరు పడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు సైతం ఇంట్లో నుంచి బయట కాలు పెట్టలేని విధంగా రోడ్డంతా మురుగు ప్రవహిస్తూ ఉంది. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని దున్నతాధికారులు దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కవిత అరెస్ట్‌కు నిరసన, రాస్తారోకో

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌కు నిరసనగా శనివారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు తెలిపారు. బీఆర్ఎస్ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ర్యాలీలు, రాస్తారోకో చేపట్టి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మానసికంగా దెబ్బతీసేందుకు ఇలాంటి కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



వారాసిగూడలో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ కంది శైలజ



అంబేద్కర్ విగ్రహం వద్ద నివేదిత, బోర్డు మాజీ సభ్యుల నిరసన



ముందస్తు అరెస్టు నేపథ్యంలో బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలు శ్రీహరి



సీతాఫల్‌మండి చౌరస్తాలో: కార్పొరేటర్ హేమ ఆధ్వర్యంలో



ఓయూ మాణికేశ్వర్‌నగర్‌లో రాస్తారోకో



నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న క్రిశాంక్



లాలాపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



తుకారాంగేట్‌లో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

బకాయిలు చెల్లించాలని నిమ్స్ డైరెక్టర్ పేషీ ముట్టడి

లక్డీకాపూల్: నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే బకాయిలను చెల్లించాలని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వెంకటేష్, ఇ.నర్సింహులు డిమాండ్ చేశారు. కార్మికులకు ఎరియర్స్ చెల్లించడంలో ఉన్నతాధికారులు కుంటి సాకులు చెపుతూ కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. శనివారం గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో పెరిగిన వీడిఏ బకాయిలను అసెంబ్లీ ఎన్నికలలో ఒక రోజు వేతనం బకాయిలను చెల్లించాలంటూ డైరెక్టర్ పేషీ ముందు బైఠాయించారు. ఈ బకాయిలకు సంబంధించిన ఫైల్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్, డైరెక్టర్ పేషీ అధికారులు తమ దగ్గర లేదంటే తమ దగ్గర లేదంటూ దాటవేత దోరణిని అవలంభించడాన్ని ఆక్షేపించారు. ఈ విషయంలో నిమ్స్‌లోని కార్మిక సంఘాలన్ని ఏకమై తమ గళం విప్పడంతో దిగొచ్చిన యాజమాన్యం సోమవారం నాటికి ఎరియర్స్ అన్ని చెల్లిస్తామని కార్మికులకు హామీ ఇవ్వడం గమనార్హమన్నారు. ఈ విషయంపై స్పందించిన డైరెక్టర్ డాక్టర్ బీరప్ప రెండు నెలల ఎరియర్స్, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు.

శస్త్రచికిత్సల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

లక్డీకాపూల్: వైద్య రంగంలో ముఖ్యంగా శస్త్ర చికిత్సల్లో ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సైద్ధాంతిక పరిజ్ఞానం, అనుభవంపై ఆచరణాత్మకమైన కలయిక అవసరమని అభిప్రాయపడ్డారు. శనివారం నిమ్స్ ట్రామా బ్లాక్ ఆడిటోరియంలో కార్డియోవాస్క్యులర్, థొరాసిక్ సర్జరీ విభాగం నియమ నిబంధనలపై రెండు రోజుల సీటీవీఎస్ బూట్ క్యాంప్‌ను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప, డీన్ డాక్టర్ లిజ రాజశేఖర్, సీటీవీఎస్ హెచ్‌ఓడీ డాక్టర్ మాలెంపాటి అమరేష్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను విడుదల చేశారు. శస్త్ర చికిత్సల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను పాటించడంతో పాటు నిబద్ధత, అభిరుచి చాలా అవసరమన్నారు. ఇలాంటి సదస్సులు, ప్యానెల్ డిస్కషన్లు, ప్రాక్టికల్ వర్క్‌షాప్‌లు ఆపరేషన్లు విజయవంతం కావడానికి పునాదిగా నిలుస్తాయన్నారు. కార్డియోవాస్క్యులర్, థొరాసిక్ సర్జరీ రంగంలో సామూహిక అవగాహన, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పలువురు వక్తలు సూచించారు. సదస్సులో డాక్టర్ టి.రామకృష్ణదేవ్, డాక్టర్ పీఎస్ఎస్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.